సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 7 । మార్చి । 2023



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.10 పలికింది.



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి. మార్కెట్‌కు 305 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్ఠం/కనిష్ఠం

38.9°/11.8°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'స్పందన' ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న నందకిషోర్

పుట్టపర్తి అర్బన్: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే 'స్పందన'లో అందే ఫిర్యాదులపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించాలని, ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా చర్యలు తప్పవని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ జిల్లా పోలీసులను హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'కు వివిధ సమస్యలపై 41 అర్జీలు అందాయి. ఒక్కో ఫిర్యాదుదారుడితో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, అడిషినల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ స్వయంగా మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. కొన్ని సమస్య పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, అత్తారింటి వేధింపులు, సెల్ ఫోన్ చోరీలు, సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- తన తండ్రి ద్వారా హిందూపురం కోటలో తనకు సంక్రమించిన పురాతన ఇంటిని పడగొట్టి నూతన ఇల్లు నిర్మించేందుకు సిద్ధం కాగా, వెనుక ఇంటి వాళ్లు ఇబ్బందులు పెడుతున్నారని అనంతపురంలో ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న నందకిషోర్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ నుంచి అనుమతులు సైతం తీసుకున్నామన్నారు. ఈ విషయమై హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఎటువంటి గొడవ లేకుండా సమస్య పరిష్కరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ 'అనుబంధ' జోనల్ ఇన్‌చార్జ్‌ల నియామకం



డీవీ నాగేంద్రకుమార్‌రెడ్డి



కె.రమణారెడ్డి

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలకు జోనల్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ సోమవారం రాత్రి ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయా జోన్‌లకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. యువజన, రైతు, విద్యార్థి, మహిళ, సేవాదళ్, వాణిజ్య, సాంస్కృతిక, పంచాయతీరాజ్, ప్రచార, చేనేత, గ్రీవెన్స్ విభాగాలతో పాటు బీసీ, మైనార్టీ, ఎస్టీ సెల్, వైఎస్సార్ టీయూసీ, వికలాంగుల విభాగం, డాక్టర్స్ వింగ్‌లకు జోనల్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఇందులో జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం లభించింది. ముగ్గురూ కదిరి నియోజకవర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. వీరి ఆధ్వర్యంలోనే అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఆయా విభాగాల కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

డాక్టర్స్ విభాగం:
డాక్టర్ డీవీ నాగేంద్రకుమార్‌రెడ్డి
వైఎస్సార్ సేవాదళ్ : సి.కృష్ణారెడ్డి
పంచాయతీరాజ్ విభాగం:
కుండిటిపడుగు రమణారెడ్డి

ఉద్యానానికి 'మూడో'చ్చింది

ప్రకృతి కరుణ.. పాలకుల ప్రోత్సాహంతో జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోంది. పండ్లతోటల సాగుకు జిల్లాలో అనుకూల వాతావరణంతో ఉండటంతో రైతులంతా రెట్టించిన ఉత్సాహంతో పంటలు వేస్తున్నారు. మొక్కల నాటడం మొదలు పంట మార్కెటింగ్ వరకూ జగన్ సర్కార్ అడుగడుగునా రైతన్నలకు అండగా నిలుస్తోంది. దీంతో కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసే వారి సంఖ్య కూడా పెరిగింది. ఫలితంగా కొత్తగా ఉద్యాన పంటల సాగులో జిల్లా రాష్ట్రంలోనే మూడోస్థానంలో నిలిచింది.

- పండ్ల తోటల సాగుపై రైతుల ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న ఉద్యాన శాఖాధికారులు
- ఏడాది లక్ష్యంలో ఇప్పటికే 90 శాతం పూర్తి
- 10 నెలల్లో కొత్తగా 1,063 హెక్టార్లలో సాగు
- కొత్తగా ఉద్యాన పంటల సాగులో జిల్లాకు మూడోస్థానం



బుక్కపట్నం సమీపంలోని ఓ రైతు సాగు చేసిన మామిడితోట

జిల్లాలో ఉద్యాన పంటల సాగు (హెక్టార్లలో)

పంట	హెక్టార్లు
దానిమ్మ	2,041
చీనీ	11,110
మామిడి	33,100
అరటి	1,661
బొప్పాయి	1,332
నిమ్మ	78
జామ	318
ద్రాక్ష	28
రోజాపూలు	286
మల్లెపూలు	177
బంతి	165
చామంతి	1205
కనకాంబరాలు	506

2022-23 ఏడాదికి సంబంధించి కొత్తగా ఏర్పాటైన పండ్ల తోటల వివరాలు

పంట	హెక్టార్లు
మామిడి	136
జామ	100
చీనీ	300
దానిమ్మ	260
సీతాఫలం	5
అరటి	70
బొప్పాయ	70
డ్రాగన్	8
అంజూర	30
ఉసిరి	13
నేరేడు	6
చింత	10
హైబ్రీడ్ కూరగాయలు	15
పూల తోటల పెంపకం	40

సాక్షి, పుట్టపర్తి: వరుణుడు కరుణించడంతో జిల్లా పరిధిలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నీటి కుండలను తలపిస్తున్నాయి. ప్రభుత్వం కూడా వర్ష రూపంలో వచ్చిన ప్రతి నీటి చుక్కనూ భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టింది. దీంతో భూగర్భజలాలు భారీగా పెరిగాయి. అలాగే వైఎస్సార్ జలకళ ద్వారా సర్కార్ బోర్లు వేయించింది. దీంతో సాగునీటి తిప్పలు తప్పాయి. ఫలితంగా బీడు భూముల్లోనూ పంటలు సాగులోకి వచ్చాయి. నీరు సమృద్ధిగా ఉండటంతో ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఎక్కువగా ఉండటంతో రైతులు వర్షాధార పంటలతో పాటు పండ్ల తోటలపై ఆసక్తి చూపుతున్నారు. అందువల్లే కేవలం ఏడాది వ్యవధిలోనే జిల్లాలో 1,063 హెక్టార్లలో పండ్ల తోటలు సాగులోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వం 2022 – 23 సంవత్సరంలో విధించిన లక్ష్యాన్ని ఉద్యాన శాఖ ఫిబ్రవరి నాటికే 90 శాతం మేర పూర్తి చేసింది.

జిల్లాకు మూడో స్థానం..

ఏడాది వ్యవధిలో కొత్తగా ఉద్యాన పంటలు సాగులోకి వచ్చిన జిల్లాల్లో శ్రీ సత్యసాయి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. తొలి రెండు స్థానాల్లో కర్నూలు, తూర్పు గోదావరి జిల్లాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 91.83 శాతం, తూర్పు గోదావరిలో 90.65 శాతం మేర ఉద్యాన పంటల లక్ష్యం పూర్తయింది. మన జిల్లాలో 90.58 శాతం లక్ష్యం పూర్తి చేసినట్లు ఉద్యాన శాఖ రికార్డుల ద్వారా తెలుస్తోంది.

ప్రోత్సాహకాలు మెండుగా...

- 2022 – 23లో ఉద్యాన పథకాలను పకడ్బందీగా అమలు చేయడానికి సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద రూ.7.36 కోట్లు కేటాయించారు.
- ఉద్యాన పంటల సాగులో రైతులకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రూ.10 లక్షలతో 'వైఎస్సార్ తోటబడి' కార్యక్రమం నిర్వహిస్తున్నారు.
- 40 శాతం సబ్సిడీతో ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీంతో మామిడి, సపోట, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, నిమ్మ, కూరగాయలు, పూల సాగు విస్తీర్ణం పెరిగింది.
- ఉద్యానశాఖలో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల వారీగా కస్టమ్ హయరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది.
- ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రూ.5.06 లక్షలతో 65 పనిముట్లను పంపిణీ చేస్తోంది. వీటిలో చిన్న ట్రాక్టర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, తైవాన్ స్ప్రేయర్లు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వీటిని అందజేస్తున్నారు.
- అలాగే రక్షిత సాగు కింద మల్చింగ్, షేడ్‌నెట్ కింద కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నారు.
- కూరగాయల సాగుకు షేడ్‌నెట్‌లు, దానిమ్మ తోటలను పరిరక్షించి కాయ నాణ్యతను పెంచేందుకు యాంటీబర్డ్ నెట్‌లు కూడా ఉద్యానశాఖ ఏర్పాటు చేస్తోంది. ఫలితంగా రైతులంతా ఉత్సాహంగా ఉద్యాన తోటల సాగుకు ముందుకు వస్తున్నారు.

లక్ష్యం పూర్తి చేస్తాం



జిల్లాలో 1,168 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులోకి తీసుకురావాలన్న లక్ష్యం ఉంది. ఇందులో ఇప్పటికే 1,063 హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. మిగతా 110 హెక్టార్లలో కూడా పంటలు సాగులోకి వచ్చే అవకాశాలున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి వివరిస్తుండటంతో ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

సత్యసాయి సన్నిధిలో మారిషస్ విదేశాంగ మంత్రి



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న మారిషస్ మంత్రి అలెన్ గాను

ప్రశాంతి నిలయం: మారిషస్ విదేశాంగ మంత్రి అలెన్ గాను సత్యసాయి సన్నిధిలో గడిపారు. సోమవారం బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తికి చేరుకున్న ఆయనకు, ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథి గృహం వద్ద సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ రాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం అలెన్ గాను సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు ఆర్‌జె రత్నాకర్ రాజుతో సమావేశమయ్యారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 62 మంది గైర్హాజరు

ప్రశాంతి నిలయం: ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉదయం సెషన్ 64 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించగా, 1,780 మంది గాను 1,742 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 61 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహించగా 1,508 మందికి గాను 1,484 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో మొత్తం 62 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్‌ను ఇంటర్ బోర్డు అధికారులు, స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

హనుమంత వాహనంపై ఖాద్రీశుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీ నారసింహుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కమనీయంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన సోమవారం రాత్రి శ్రీవారు హనుమంత వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నరసింహావతారంలో హిరణ్యకశ్యపుని సంహారం అనంతరం శ్రీమహావిష్ణువును సాక్షాత్తు హనుమంతుడే దిగివచ్చి తన భుజస్కంధాలపై మోస్తాడని భక్తుల నమ్మకం. హనుమంతుని భక్తి తత్పరతను నేటి తరం వారికి వివరిస్తూ రాముడు, కృష్ణుడు, నారసింహుడు అన్నీ తానేనని స్వామి వారు తెలియజేస్తారని అర్చకులు వివరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

నేడు బ్రహ్మ గరుడసేవ..

ఖాద్రీ నారసింహుడు మంగళవారం గరుడవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాలకు సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే ఈ బ్రహ్మోత్సవాలను దగ్గరుండి నడిపిస్తారని భక్తుల నమ్మకం.

రైతులకు విరివిగా రుణాలివ్వాలి

- డీఎల్ఆర్సీలో కలెక్టర్ బసంత్‌కుమార్



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ రకాల పథకాలకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు త్వరిత గతిన చేరుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి రివ్యూ కమిటీ(డీఎల్ ఆర్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక, వివిధ బ్యాంకులు సాధించిన ప్రగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బ్యాంకులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు వేగవంతం చేయాలన్నారు.

రుణ మంజూరులో జాప్యం వద్దు..

రైతులకు పంట రుణాలతో పాటు చిరు వ్యాపారులకూ రుణాలు ఇవ్వాలని, ఇందులో ఏ జాప్యం పనికి రాదని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు, స్టాండప్ ఇండియా, పీఎం ముద్ర యోజన రుణాలు, చేనేత, పశుసంవర్ధక, మత్స్యశాఖ రైతులకు రుణాలు అందించడంలో పురోగతి సాధించాలన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకులు డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలో చిరువ్యాపారులకు అందించే రుణాల్లో లక్ష్యాలను చేరుకోలేదన్నారు. వెంటనే అర్హులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, సూక్ష్మ చిన్న, మధ్య తరహా రంగాలపై(ఎంఎస్ఎంఈ) ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఆయా రంగాల్లోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా ముందుకు రావాలన్నారు. గృహ రుణాలు, టిడ్కో ఇళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఇవ్వాల్సిన చాలా రకాల రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రుణాల మంజూరులో అధికారులు, బ్యాంకర్లకు మధ్య సమన్వయం ఉండాలన్నారు. మార్చి 31 నాటికి 100 శాతం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. బ్యాంకుల ఆర్థిక స్వావలంబన కోసం రుణాల రికవరీపై దృష్టి సారించాలన్నారు. ఇక నుంచి ప్రతి నెలా బ్యాంకర్లతో సమావేశం ఉంటుందన్నారు.

వ్యవసాయ రంగానికే రూ.6,231 కోట్లు..

ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.8,133.70 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించగా, డిసెంబర్ త్రైమాసికానికి గాను వివిధ బ్యాంకులు రూ.8,656.01 కోట్లు మంజూరు చేశాయని కలెక్టర్ తెలిపారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.6231.52 కోట్లు, పంట రుణాలకు రూ.3,840.66 కోట్లు, ఎంఎస్ఎంఈ సెక్టార్‌కు రూ.618.75 కోట్ల రుణాలు ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం అనిల్‌కుమార్, రవిచంద్రారెడ్డి, ఎల్‌డీఎం సాయినాథరెడ్డి, కెనరా బ్యాంకు ఏజీఎం రాంప్రసాద్‌రెడ్డి, ఎస్‌బీఐ ధర్మవరం ఆర్‌ఎం సంజీత్‌కుమార్, యూబీఐ ఏజీఎం అశ్వర్థనాయక్, డీఏఓ సుబ్బారావు, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, డీఐసీ జనరల్ మేనేజర్ చంద్రబాబు, డీహెచ్‌టీఓ రమేష్, డీఐసీపీఐ కేవీ రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- యూబీఐ బిజినెస్ కరస్పాండెంట్ ఘరానా మోసం
- పొదుపు సంఘాల మహిళల డిపాజిట్లు, రుణ కంతుల నగదు స్వాహా
- నివ్వెర పోయిన బాధిత పొదుపు సంఘాల మహిళలు
- న్యాయం చేయాలంటూ బ్యాంక్ ఎదుట ధర్నా


రూ.కోటి కొట్టేశాడు!



న్యాయం చేయాలంటూ యూనియన్ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు



బిజినెస్ కరస్పాండెంట్ బోగే శివారెడ్డి



శివారెడ్డి సంతకంతో పాసుపుస్తకంలో లావాదేవీలు

ధర్మవరం: బ్యాంకుకు...గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు వారధిగా ఉండాల్సిన బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) పొదుపు మహిళలకు టోకరా వేశాడు. రుణ వాయిదా కోసం పొదుపు మహిళలు చెల్లించిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేశాడు. మొత్తంగా రూ.కోటి కొట్టేశాడు. నకిలీ రసీదులిచ్చి, బ్యాంక్ పాసు పుస్తకాలపైన ఫోర్జరీ సంతకాలు చేసి మరీ దందా నడిపాడు. చివరకు మహిళా సంఘాలకు సంబంధించి రుణాలు మొండి బకాయిల జాబితాలో చేరడంతో బ్యాంక్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. దీంతో బీసీ బండారం బట్టబయలైంది. తాము మోసపోయిన విషయం గుర్తించిన మహిళలు ధర్మవరంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టారు.

ఐదేళ్లుగా విధులు..

ధర్మవరం యూనియన్ బ్యాంక్‌కు మండలంలోని రేగాటిపల్లిలో స్థానికుడైన బోగే శివారెడ్డి ఐదేళ్లుగా బిజినెస్ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. స్థానికుల నుంచి డిపాజిట్లు, రుణాలకు సంబంధించిన వాయిదా సొమ్ము సేకరించి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ఆయన విధి. ఇలా బ్యాంక్‌లో రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు సంబంధించిన రుణాల వాయిదాల డబ్బు ప్రతి నెలా తీసుకుని రసీదులిచ్చి బ్యాంక్‌లో చెల్లించేవాడు.

కాసుల కోసం పక్కా స్కెచ్..

కొంతకాలం పాటు బిజినెస్ కరస్పాండెంట్‌గా చురుగ్గా పని చేసిన బోగే శివారెడ్డి ఈజీ మనీ కోసం పక్కా స్కెచ్ వేశాడు. గ్రామంలోని 26 పొదుపు సంఘాల సభ్యులు 260 మంది ప్రతి నెలా చెల్లించే రుణ కంతుల మొత్తం స్వీకరించి నకిలీ రసీదులు ఇవ్వడం ప్రారంభించాడు. ఆ మొత్తాన్ని బ్యాంక్‌కు చెల్లించకుండా తన వద్దే ఉంచుకున్నాడు. బ్యాంక్ పాసుపుస్తకాల్లో సైతం ఫోర్జరీ సంతకాలు, ఎంట్రీలు చేసేవాడు. దీంతో ఒక్కో పొదుపు సంఘం రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు బకాయి పడింది. అంతేకాకుండా బకాయిలు పడ్డ గ్రూప్ సభ్యులకు బకాయిల విషయం తెలియకుండా మళ్లీ కొత్త రుణాలు ఇప్పించి బకాయిలను కప్పి పుచ్చేవాడు. ఈ తంతులో గతంలో పని చేసిన బ్యాంక్ సిబ్బంది శివారెడ్డికి సహకరించడంతో అవినీతితంతు సుదీర్ఘంగా జరిగింది.

విచారణలో బండారం బట్టబయలు..

ఇటీవల యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు రేగాటిపల్లిలోని పొదుపు సంఘాలు చాలా వరకు మొండి బకాయిల జాబితాలో ఉండటం గమనించారు. దీంతో వారు నేరుగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ విచారణలో బిజినెస్ కరస్పాండెంట్ బోగేశివారెడ్డి పొదుపు సంఘాల నుంచి వసూలు చేసిన డబ్బులు బ్యాంక్‌కు చెల్లించడం లేదని నిర్ధారణకు వచ్చారు. వాస్తవానికి మూడు నెలలు రుణ కంతులు చెల్లించకపోతే ఆ అకౌంట్ ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మింగ్ అకౌంట్) అవుతుంది. కానీ ఏళ్లుగా బోగే శివారెడ్డి పొదుపు మహిళలు సొమ్ము వాడుకుంటూ వచ్చినా విషయం బయటకు పొక్కలేదు. ఇందుకు గతంలో బ్యాంకులో పనిచేసిన సిబ్బంది కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

ఆందోళనకు దిగిన మహిళలు..

బిజినెస్ కరస్పాండెంట్ శివారెడ్డి చేసిన అవినీతి వ్యవహారం తెలియడంతో రేగాటిపల్లి పొదుపు సంఘాల మహిళలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. న్యాయం చేయాలని సోమవారం యూనియన్ బ్యాంక్ ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా చేపట్టారు. ఈ వ్యవహారంలో మొత్తం రూ.కోటి వరకు డబ్బులు కాజేసినట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేస్తున్నాం

బ్యాంక్ కరస్పాండెంట్ ఖాతాదారుల సొమ్మును బ్యాంక్‌కు చెల్లించకుండా కాజేసినట్లు మా విచారణలో తేలింది. ఎంత డబ్బు కాజేశాడో పూర్తిగా విచారణ జరిపి ఖాతాదారులతో కలిపి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చి డబ్బు రికవరీ చేసేలా చర్యలు చేపడతాం. ఇలాంటి తప్పు ఇకపై పునరావృతం కాకుండా చర్యలు చేపడతాం.

– జయప్రకాష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, ధర్మవరం

మోసం చేశాడు



పొదుపు సంఘాలకు సంబంధించిన రుణ వాయిదాలను ప్రతి నెలా క్రమం తప్పకుండా బ్యాంక్ కరస్పాండెంట్‌కు చెల్లించాం. తీరా ఇప్పుడు చూస్తే రూ.2 లక్షల దాకా రుణ బకాయి ఉందని చెబుతున్నారు. బ్యాంక్ అధికారులు స్పందించి బీసీ కాజేసిన డబ్బును రికవరీ చేయాలి.

– భాగ్యమ్మ, వెంకటేశ్వర మహిళా సంఘం సభ్యురాలు, రేగాటిపల్లి

డబ్బు రికవరీ చేయాలి



మేం రుణ వాయిదాలు ప్రతి నెలా సక్రమంగా చెల్లించాం. బ్యాంక్ అధికారులేమో డబ్బు జమ కాలేదు అంటున్నారు. మేము ప్రతినెలా చెల్లించిన మొత్తానికి సదరు బ్యాంక్ కరస్పాండెంట్ రసీదులు ఇవ్వడంతో పాటు పాసుపుస్తకంలోనూ రాసిచ్చాడు. సదరు వ్యక్తిని బ్యాంక్ వారే నియమించారు. అందువల్ల డబ్బు రికవరీ చేసి న్యాయం చేయాలి.

– నాగలక్ష్మి, మల్లేశ్వర స్వామి మహిళా సంఘం, రేగాటిపల్లి

క్లుప్తంగా

తల్లీకుమార్తె అదృశ్యం



అదృశ్యమైన సువర్ణ చిన్నారి లహరి

రొళ్ల: మండలంలోని రొళ్లవడ్రహట్టి గ్రామానికి చెందిన ఈరన్న భార్య సువర్ణ కుమార్తె లహరితో కలసి ఆదివారం రాత్రి నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు సోమవారం రాత్రి ఈరన్న ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకూ ఇంట్లోనే ఉన్నారని, రాత్రి ఉన్నఫళంగా కుమార్తెను తీసుకుని తల్లి వెళ్లిపోయిందని ఈరన్న ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం చుట్టుపక్కల గ్రామాలతో పాటు బంధువుల ఇళ్లు, తెలిసిన వారి ఇళ్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఆచూకీ తెలిస్తే 93460 10559కు సమాచారం అందించాలని కోరారు.

జేసీబీ డ్రైవర్ బలవన్మరణం

తనకల్లు: స్థానిక బూడిదగడ్డ వీధిలో నివాసం ఉంటున్న జేసీబీ డ్రైవర్ వెంకట చలపతి (26) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... కర్ణాటకలోని శ్రీనివాసపురం సమీపంలో ఉన్న నిమ్మనహళ్లికి చెందిన వెంకట చలపతి కొంత కాలంగా తనకల్లులో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇక్కడే అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు గమనించి చికిత్స కోసం కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ..

ధర్మవరం అర్బన్: ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణంలోని చంద్రబాబునగర్‌లో ఘటన చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... చంద్రబాబునగర్‌కు చెందిన పవన్ రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈయన భార్య ఆవుల జ్యోతి (38). వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జ్యోతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన భర్త పవన్ భార్య ఉరికి వేలాడుతుండడం గుర్తించి హతాశుడయ్యాడు. స్థానికుల సాయంతో భార్యను కిందకు దింపి ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు ఆసుపత్రికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తలనొప్పి, మానసిక వ్యాధి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంధాలు తుడిచేస్తూ..



ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌తో తన గోడు వెళ్లబోసుకుంటున్న ఇతని పేరు శ్రీనివాసులు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లికి చెందిన ఆయనకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఐదారేళ్లు సంతోషంగా కాపురం చేశారు. అనంతరం ఇద్దరి మధ్య మనస్పర్థలు చెలరేగాయి. అప్పటి నుంచి విడివిడిగా నివసిస్తున్నారు. ఈ క్రమంలో తన భార్య తరచూ మహిళా సంఘాలను సంప్రదించి, వారి ద్వారా వేధింపులకు గురి చేస్తోందని, ఆమెతో కలసి జీవించలేనని, ఎలాగైనా తనకు విముక్తి కల్పించాలంటూ గత నెల 27న జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమంలో ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశాడు.

... ఇలాంటి కేసులు వారంలో కనీసం నాలుగైదు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసు స్పందన కార్యక్రమంలో సైతం సింహభాగం వినతులు ఈ తరహా కేసులే ఉండడం గమనార్హం. సుఖదుఃఖాల్లోనూ, కష్టనష్టాల్లోనూ తోడుగా ఉంటానని ప్రమాణం చేసి ఏర్పరుచుకున్న వైవాహిక బంధం.. ముచ్చటగా మూడేళ్లయినా కలిసి ఉండకుండానే విడిపోతోంది. ప్రేమ.. ఆప్యాయతలతో ఉండాల్సిన దంపతులు వివాహేతర సంబంధాల మోజులో సంసారాలను కూలదోసుకుంటున్నారు.

☛ ముదిగుబ్బ మండలంలోని ఓ గ్రామ రెవెన్యూ అధికారి ఇటీవల పోలీసులను ఆశ్రయించారు. నల్లమాడకు చెందిన ఓ వ్యక్తితో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని, దీంతో కాపురానికి రాకుండా కుటుంబ సభ్యులను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె నుంచి ఉపశమనం కలిగించాలని వేడుకున్నాడు.



- పచ్చని సంసారంలో వివాహేతర సంబంధాల చిచ్చు
- కలిసుండలేమంటూ న్యాయస్థానం, పోలీసులను ఆశ్రయిస్తున్న దంపతులు
- 'పోలీసు స్పందన'లోనూ అత్యధిక వినతులు ఇవే

సాక్షి, పుట్టపర్తి: పెళ్లంటే నూరేళ్ల పంట అంటారు పెద్దలు. పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తుల్ని కాదు రెండు కుటుంబాల్ని కూడా ఒకటి చేస్తుంది. జీవిత భాగస్వామితో జీవితాంతం కలిసి ఉండాలని వేద మంత్రాల సాక్షిగా ప్రమాణం చేస్తారు. అయితే ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యాంత్రికంగా సాగిపోతోన్న జీవితాల్లో వివాహ బంధం సైతం అంతే వేగంగా విడిపోతోంది.

20 శాతం ఆ కేసులే..

వివాహేతర సంబంధాలు మోజులో నీతో కలిసుండలేనంటూ పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్న జంటల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సాక్షాత్తూ ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ సమక్షంలో ఇలాంటి వినతులే ఎక్కువగా అందుతుండడం కలవరపెడుతోంది. సగటున 80 నుంచి వంద వినతులు అందితే... ఇందులో 20 శాతం కుటుంబ సమస్యలకు సంబంధించినవే కావడం గమనార్హం. గత నెల వరకూ అందిన మొత్తం 2,196 వినతుల్లో కుటుంబ కలహాలకు సంబంధించినవి 323 ఉన్నట్లు పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

అనాలోచిత నిర్ణయంతో..

తెలిసీతెలియని వయసులో చేసిన పెళ్లిళ్లలో అత్యధిక మంది ఇతరుల ఆకర్షణలో పడి జీవితాను నాశనం చేసుకుంటున్నారు. కొత్త దాంపత్య జీవితంలో ఇష్టంగా అడుగు పెట్టినా.. చిన్నపాటి విషయాలను పెద్దవి చేసుకుని గొడవ పడుతున్నారు. అనాలోచిత నిర్ణయాలతో విడాకులు కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దలకు చెప్పి.. పంచాయితీలు చేసినా ఆ బంధం కలిసి ఉండడం లేదు. అనంతరం దిశ పోలీస్ స్టేషన్లు, గృహహింస చట్టం కింద కేసుల నమోదు షరామామూలై పోతోంది. ఫలితంగా ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకుని విడిపోయే పరిస్థితులకు దారి తీస్తోంది.

మూడో వ్యక్తి ప్రమేయం వద్దు

వైవాహిక బంధం ఏర్పడిన తర్వాత ఒకరి మాటకు మరొకరు గౌరవం ఇవ్వాలి. మనసును ఎరిగి మసులుకోవాలి. ఈ అంశాలను విస్మరించి భార్యభర్తలు కాకుండా మూడో వ్యక్తితో బాధలు పంచుకున్నప్పుడు అవతలి వ్యక్తికి లోకువ అయ్యే ప్రమాదముంది. ఈ బలహీనతను అవతలి వ్యక్తి తెలివిగా సొమ్ము చేసుకుని లోబర్చుకునే ప్రమాదమూ ఉంది. ఇప్పటి వరకూ వివాహేతర సంబంధాలు నెలకొన్న కేసుల్లో అత్యధికం ఈ తరహామే కావడం గమనార్హం. అయితే ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే గురువు దండిస్తే శిక్షను స్వీకరిస్తాం, బయట ఎవరైనా ఏమైనా అంటే సర్దుకుని మసులుతాం, ఉద్యోగం చేసే చోట బాస్ తిడితే ఎంతైనా బాధపడతాం కానీ ఉద్యోగాన్ని వీడిపోం. అలాంటిది భార్యాభర్తలు మాత్రం ఎందుకు విడిపోవాలి? రోజులో కొంత సమయం తమ కోసం దంపతులు కేటాయించుకుని ఆత్మనూన్యతకు లోనుకాకుండా మాట్లాడుకుంటే ప్రశాంత జీవనం సాగించేందుకు మార్గం సుగమమవుతుంది. దంపతుల మధ్య బంధం బలపడి సమస్యలన్నీ సర్దుకుపోతాయి.

తల్లిదండ్రులు స్నేహంగా మెలగాలి



ప్రతి మనిషికీ తోడు ఎంతో అవసరం. మంచీచెడులను వివరించి చెప్పగలిగే స్నేహితుడు దొరికిన వారు చాలా అదృష్టవంతులు. ఆ స్నేహం తల్లిదండ్రులదైతే మరింత బాగుంటుంది. అప్పుడే పిల్లల మధ్య తలెత్తిన మనస్పర్థలను దూరం చేయగలుగుతారు. అలా కాదని మూడో వ్యక్తికి అవకాశమిస్తే అన్నింటా అనర్థాలే ఉత్పన్నమవుతాయి.

– లక్ష్మన్న, సీఐ, దిశ పోలీస్ స్టేషన్, పుట్టపర్తి

పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న మధు

కనగానపల్లి: పోలీసుల విచారణకు భయపడిన ఓ యువకుడు పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. కనగానపల్లి మండలం మద్దెలచెరువు గ్రామంలో శనివారం రాత్రి వేరుశనగ వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బాధితరైతు రామాంజినేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసులో అనుమానితుడిగా అదే గ్రామానికి చెందిన మధుని విచారణ నిమిత్తం సోమవారం పోలీస్ స్టేషన్‌కు రప్పించుకున్నారు. దీంతో అవమానంగా భావించిన మధు... తన వెంట తీసుకెళ్లిన ఫినాయిల్‌ను పోలీస్ స్టేషన్ ఎదుట తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విచారణలో భాగంగానే మధుని స్టేషన్‌కు పిలిపిచామని, అయితే అతన్ని ప్రశ్నించకముందే అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. కాగా, మధు పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పురుగుల మందు తాగి..

ఓడీ చెరువు: మండలంలోని మల్లెలవాండ్లపల్లికి చెందిన ఈశ్వరరెడ్డి కుమారుడు సాంబశివారెడ్డి సోమవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడివున్న సాంబశివారెడ్డిని కుటుంబసభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

● బ్రహ్మ కడిగిన పాదం



కదిరి కొండ (ఇన్‌సెట్) నారసింహుడి పాదాలు

కదిరి: 'బ్రహ్మ కడిగిన పాదము... బ్రహ్మము దానె నీ పాదము' అంటూ తాళ్లపాక అన్నమాచార్య కొనియాడిన శ్రీవారి పాదాలు కదిరి కొండపై భక్తుల నీరాజనాలు అందుకుంటున్నాయి. స్వామి పాదాలు తాకితే ఈ జన్మ ధన్యమవుతుందనే నమ్మకంతో బ్రహ్మోత్సవాలకు వచ్చే అశేష భక్తులు శ్రీవారి పాదాలను దర్శించుకునేందుకు కదిరి కొండకు బారులు తీరుతున్నారు. ఈ పాదాలకు ఖాద్రీశుడి ఇతిహాస పుటల్లో ప్రత్యేక స్థానముంది. పూర్వం హిరణ్యకశ్యపుడిని నరసింహ అవతారంలో సంహరించిన శ్రీహరి... అదే ఉగ్రరూపంతో కదిరి కొండపై అడుగిడినట్లు భక్తుల నమ్మకం. అక్కడే ఉగ్రరూపాన్ని ఉపసంహరించుకునేలా ప్రహ్లాదుడు, దేవతలు స్తుతించడంతో శ్రీహరి ప్రసన్నుడై దేవేరులతో కలసి దర్శనమిచ్చినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి నారసింహుడు ఖాద్రీ (కదిరి) క్షేత్రంలో భక్తవల్లభుడై కొలువుదీరినట్లు ఇతిహాసాలు చెబుతున్నాయి. కదిరి కొండపై స్వామి పాదాలు మోపిన చోట ఉన్న గుర్తులు నేటికీ భక్తుల పూజలు అందుకుంటున్నాయి.

బంజారా భవన్ ఏర్పాటుకు సహకరించండి

- కలెక్టర్‌కు విన్నవించిన జాతీయ బంజారా సేవా సంఘం సభ్యులు


కలెక్టర్ బసంత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బంజారా సంఘం నాయకులు

పుట్టపర్తి అర్బన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తికి దేశ వ్యాప్తంగా ఉన్న బంజారాలు విచ్చేస్తుంటారని, ఈ క్రమంలో పుట్టపర్తిలో అన్ని వసతులతో కూడిన బంజారా భవన్ నిర్మాణానికి సహకరించాలంటూ కలెక్టర్ బసంత్‌కుమార్‌ను జాతీయ బంజారా సేవా సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో సంఘం ప్రతినిధులు కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జేసీ టీఎస్ చేతన్, డీఆర్వో కొండయ్యను కలసి సన్మానించారు.

జిల్లా కమిటీ ఎంపిక..

ఆలిండియా బంజారా సేవా సంఘానికి సంబంధించి జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి నాయక్, ఎస్ఈసీ సభ్యుడు రవీంద్ర నాయక్, స్టేట్ కో–ఆర్డినేటర్ గోపాల్ నాయక్ సమక్షంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగినాయని చెరువు తండా ఆంజనేయులు నాయక్, గౌరవాధ్యక్షుడిగా బ్రాహ్మణపల్లి తండా సతీష్‌నాయక్, ఉపాధ్యక్షులుగా పుట్టపర్తి డాక్టర్ నాగరాజునాయక్, ధర్మవరం సుధాకర్‌నాయక్, పెడపల్లి తండా మోహన్‌నాయక్, నాగినాయని చెరువు తండా రాజేష్‌నాయక్, గుంటిపల్లి తండా రవీంద్రనాయక్, మడకశిర గిరిధర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పుట్టపర్తి రామాంజనేయులు నాయక్, జనరల్ సెక్రెటరీగా కాలేనాయక్, ట్రెజరర్‌గా హిందూపురం ఏఆర్‌డీ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు, యూత్ వింగ్, మహిళా విభాగం, లీగల్ అడ్వయిజర్, మీడియా సెల్, ఈసీ మెంబర్లుగా మొత్తం 40 మందిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో 99 కేంద్రాలు
- ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు
- తొలిసారి సమస్యాత్మక సెంటర్లు లేకుండా పరీక్షలు



రాప్తాడు రూరల్: ఇంటర్ విద్యార్థుల వార్షిక పరీక్షల సందడి మొదలైంది. గత నెల 20 నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారంతో ముగియనున్నాయి. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ థియరీ పరీక్షలు ఉంటాయి. జిల్లాలో తొలిసారి సమస్యాత్మక సెంటర్ అనేది లేకుండా పరీక్షలు నిర్వహిస్తుండడం గమనార్హం.

మొత్తం 63,090 విద్యార్థులు..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈసారి 63,090 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి 41,186 మంది, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 21,904 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలోనూ అనంత జిల్లాలో 18,500 మంది ప్రథమ, 22,587 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉండగా... శ్రీసత్యసాయి జిల్లాలో 9,307 మంది ప్రథమ, 12,597 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. అనంతపురం జిల్లాలో 60 కేంద్రాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 39 కేంద్రాలను కేటాయించారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాలు మంగళ, బుధవారాల్లో ఆయా జిల్లాలకు చేరుకున్నాయి.

నిఘా నీడలో పరీక్షలు..

ఈ ఏడాది పరీక్షల నిర్వహణను అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తొలిసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్కటంటే ఒక్కటి సమస్యాత్మక సెంటర్‌గా గుర్తించకుండా పటిష్ట నిఘా నీడలో పరీక్షల నిర్వహణకు సిద్ధమయ్యారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. దాదాపు 3 వేలమంది వరకు ఇన్విజిలేటర్లను నియమిస్తున్నారు. ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు అమరుస్తున్నారు. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో ప్రశ్నపత్రం తెరిచే ప్రదేశంలోనూ సీసీ కెమెరా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి కేంద్రంలోనూ ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నీచరు, తాగునీరు, వెలుతురు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

సెల్‌ఫోన్ ఫ్రీ జోన్లుగా పరీక్ష కేంద్రాలు..

సెల్‌ఫోన్ ఫ్రీ జోన్లుగా పరీక్ష కేంద్రాలుండాలంటూ జిల్లా అధికారులకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. పరీక్ష కేంద్రంలో ఏ స్థాయి అధికారి అయినా సెల్‌ఫోన్‌ను దగ్గర ఉంచుకోరాదు. రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ కోసం, సమాచారం తెలుసుకునేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు మాత్రమే ప్రత్యేక కీప్యాడ్ ఫోన్లు వినియోగించేలా ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని కూడా నేరుగా ఇంటర్ బోర్డునే సరఫరా చేస్తోంది. సిమ్‌కార్డులు సైతం బోర్డునే అందజేస్తోంది. బోర్డు పంపిన సెల్‌ఫోన్లు సీఎస్‌ల వద్ద తప్ప మరెవరివద్ద కనిపించకూడదు. ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను కూడా అనుమతించరు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఏఎన్‌ఎం స్థాయి వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు.

కమనీయం... శ్రీవారి కల్యాణం


లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

చిలమత్తూరు: మండల కేంద్రంలో వెలసిన కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు, అర్చనలు, అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపై అధిష్టింపజేసి మధ్యాహ్నం 2 గంటలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నేత దివాకర్‌రెడ్డి భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

కసాపురంలో 22 నుంచి ఉగాది ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22న ఉగాది ఉత్సవాలు ప్రారంభమవుతాయని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. సోమవారం ఉగాది ఉత్సవాల ఏర్పాట్లపై దేవస్థానంలో ఈఓ డి.వెంకటేశ్వర్లుతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో 22న గ్రామోత్సవం, 23న రథోత్సవం, 24న లంకాదహనం ఉంటుందన్నారు. ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతారన్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. 30న శ్రీరామ నవమికి కావాల్సిన ఏర్పాట్లపైనా చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ సుగణమ్మ, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న, ఆలయ ఏఈఓ ధనుంజయ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ


తనకల్లు: మండలంలోని నల్లగుట్లపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ మీనాక్షి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పాఠ్యాంశాల పూర్తయిందా, లేదా అని ఆరా తీశారు. ఇంకా ఏదైనా సిలబస్ పూర్తికాకపోతే పది రోజుల్లోపు పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలపై విద్యార్థులను చైతన్య పరిచారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలంటూ సూచించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బాలికలతో ప్రత్యేకంగా మాట్లాడారు. కార్యక్రమంలో తనకల్లు, కదిరి ఎంఈఓలు లలితమ్మ, చెన్నకృష్ణ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బత్తలపల్లి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన దాదాపు పది మందికి పైగా సోమవారం రాత్రి ఆటోలో ముదిగుబ్బ మండలం సంకేపల్లి సమీపంలోని వీరనారాయణస్వామి మారుపూజకు బయలుదేరారు. బత్తలపల్లి మండలం కట్టకిందపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు ఆటో డ్రైవర్ కళ్లు కనిపించక నిర్మాణంలో రోడ్డులోకి దూసుకెళ్లడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ముసలక్క, నాగరాజు, యల్లమ్మ, మల్లన్న, అశ్విని, అశ్వత్థమ్మ, అక్కమ్మ, షణ్ముఖ గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్, హైవే అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


గాయపడిన నాగరాజు


యల్లమ్మ


అశ్వత్థమ్మ


షణ్ముఖ